క్లుప్తంగా

పంటల బీమా దరఖాస్తుకు గడువు నేడు


రైతులతో మాట్లాడుతున్న ఏఓ

దొనకొండ: రైతులు పండించే పంటలకు బీమా కోసం దరఖాస్తు చేసుకునేందుకు గురువారంతో గడువు ముగియనున్నట్లు మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ తెలిపారు. మండలంలోని మంగినపూడి, భూమనపల్లి గ్రామాల్లోని రైతులు సాగు చేసిన పంట పొలాలను ఆయన బుధవారం పరిశీలించారు. రైతులు పంటలకు బీమా చేసుకునేందుకు ఒక్క రోజు మాత్రమే ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సూచించారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ


ఉపకరణాలు పంపిణీ చేస్తున్న అధికారులు

కురిచేడు: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు బుధవారం ఉపకరణాలు పంపిణీ చేశారు. మండల విద్యాశాఖ అధికారి వస్త్రం నాయక్ మాట్లాడుతూ దివ్యాంగులను సమాజంలో చిన్నచూపు చూడకూడదని, తల్లిదండ్రులు వారిలో ఉన్న శక్తి సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ఎంఈఓ-2 సుబ్బారావు మాట్లాడుతూ దివ్యాంగుడైన నిక్ మ్యూజిక్ గురించి వివరించారు. అతనికి కాళ్లు, చేతులు లేకున్నా అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారని వివరించారు. దివ్యాంగ విద్యార్థులకు రెండు సీపీ చైర్లు, వీల్ చైర్ పంపిణీ చేశారు. కండరాల బలహీనత కలిగిన విద్యార్థులకు ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ చేయనున్నట్లు తెలిపారు. ఫిజియోథెరపీస్టు అంకారావు, రిసోర్స్ ఉపాధ్యాయులు సురేష్, గురువార్ధన్‌రావు, హెచ్ఎం విజయకుమార్ పాల్గొన్నారు.

పత్తి పంటల పరిశీలన


రైతులకు సూచనలిస్తున్న ఏఓ

పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి జవహర్‌లాల్ నాయక్ బుధవారం మండల పరిధిలోని తిమ్మాపురం, జమ్మిదోర్నాలలో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి గ్రామంలో సాగు చేసిన పత్తి పంటలు పరిశీలించారు. పత్తిలో ఎండు తెగులును గుర్తించారు. దీని నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అన్నదాతా సుఖీభవ, పీఎం కిసాన్, అభ జన్ భగీరథ తదితర పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ చైతన్యకుమార్, రవికుమార్, రాములమ్మ, భాస్కర్‌రెడ్డి, రామయ్య పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు


బాబు మోసాలు తెలిపే క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగనన్న రాజ్యం కోసం

జనం ఆసక్తి

- బాబు మోసాలపై భగ్గుమంటున్న ప్రజలు
- అన్ని వర్గాలను మోసం చేసిన కూటమి నేతలు
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సభలో ప్రజాగ్రహం
- 2029లో కార్యకర్తలకు న్యాయం గ్యారెంటీ
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి

కురిచేడు: సీఎం చంద్రబాబు మోసాలపై ప్రజలు భగ్గుమంటున్నారు. స్థానిక గుంటక నాసరరెడ్డి కళ్యాణ మండపంలో బుధవారం పార్టీ మండల కన్వీనర్ వైవీ సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగంలో ఇబ్బంది పడుతున్న ప్రతి కార్యకర్త, నాయకుడికి జగన్ 2.0లో న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు వైఎస్సార్ ఆశయ సాధన కోసం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా కష్టకాలంలో కూడా ప్రజా సంక్షేమాన్ని మరువలేదని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు వారి అవసరాలను గుర్తించి అడగకుండానే అవసరాలు తీర్చిన ఆదర్శ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మాత్రమేనన్నారు. ఎటువంటి అనుభవం లేకున్నా ప్రజల సంక్షేమం, అభివృద్ధి అంటూ ప్రజల కోసం ఆరాటపడి అనేక పథకాలు అమలు చేసి అందరితో మన్ననలు పొందారని గుర్తుచేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి, వేదికపై జెడ్పీ చైర్మన్ వెంకాయమ్మ

బాబు జీవితమంతా మోసాలే

చంద్రబాబు నాయుడు పదవి కోసం మామను వెన్నుపోటు పొడిచి, బావమరుదులను మోసం చేశాడని బూచేపల్లి విమర్శించారు. 2014లో అనేక మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు ఏం చేయకుండా మోసంచేశారని గుర్తుచేశారు. 10 సంవత్సరాల ఉమ్మడి రాజధానిని వదిలి హడావుడిగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రాజధానిని అమరావతికి మార్చి ప్రజలను మోసం చేశారన్నారు. దొనకొండను పారిశ్రామిక కారిడార్‌గా మార్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని ఎద్దేశా చేశారు. 2024లో అలవికాని హామీలు ఇచ్చి అందరినీ మోసం చేశారన్నారు. తల్లికి వందనం తొలి ఏడాది ఇవ్వలేదని, రెండో ఏడాది జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షాన నిలిచి నిలదీయడంతో అరకొరగా ఇచ్చి చేతులెత్తేశాడని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాలు ఊసే లేదన్నారు. మహిళలకు నెలకు రూ.1500 పథకం అడిగితే రాష్ట్రాన్ని అమ్మాలని మాట్లాడుతున్నారని, ఈ విషయం కూడా తెలియకుండానే హామీ ఎలా ఇచ్చారని, మీ 40 ఏళ్ల ఇండస్ట్రీ అనుభవం ఇదేనా? అని నిలదీశారు.

ప్రజావేదికలో చేతులెత్తేసిన బాబు

ప్రజల మధ్య ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసి చూపిస్తానని చెప్పి ప్రజావేదికలో నిస్సిగ్గుగా చేతులెత్తేయడం ప్రజలను మోసం చేయటం కాదా? అని ఆయన ప్రశ్నించారు. కనీసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను సైతం అమలు చేయలేక వాటిని అనేక వంకలు చూపి తొలగిస్తున్నారన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని, ప్రజాసంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు పైనే దృష్టి సారించారని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలకు పేర్లు మార్చి తన కుమారుడు కనిపెట్టినట్లు ప్రచారం చేసుకోవటానికి ఏడాదిన్నర కాలం పట్టిందన్నారు.

జగన్‌కు ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక..

ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజలను మెప్పించలేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడటం ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా ఉందని ఎమ్మెల్యే బూచేపల్లి విమర్శించారు. ప్రజల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి ఉన్న ఆదరణ చూసి ఓర్వ లేక జగన్ కార్యక్రమాలకు నిబంధనలు విధిస్తున్నారని, జగన్ సమావేశాలకు ఇచ్చే అనుమతుల్లో ప్రజల కన్నా పోలీసులే అడ్డుకునేందుకు ఎక్కువ మందిని వస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను ఆపలేరని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలు ఆగరని కుండబద్దలు కొట్టారు. పొదిలిలో అక్రమంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు 40 మందిపై కేసులు బనాయించి వేధిస్తున్నారని, ఇలాంటి కుట్రలు, కుతంత్రాలకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని, ఎన్ని పార్టీలు ఏకమైనా ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేసుకున్న వైఎస్సార్ సీపీని, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఏం చేయలేరని హితవు పలికారు. ఎన్నికలకు ముందు ఏ అన్యాయం జరిగినా ప్రశ్నిస్తామన్న పవన్ గొంతు మూగబోయిందని, జరుగుతున్న అన్యాయాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బాబు మోసాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రతి ఒక్కరికీ వివరించాలని పిలుపునిచ్చారు.

కమీషన్ల కక్కుర్తి బూచేపల్లి చరిత్రలో లేదు

- జెడ్పీ చైర్మన్ వెంకాయమ్మ

కమీషన్లకు కక్కుర్తి పడటం బూచేపల్లి కుటుంబ చరిత్రలోనే లేదని, ఇక ముందు కూడారాదని జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి ఆ కుటుంబానికి బూచేపల్లి కుటుంబం తోడుగా ఉందని ఆమె గుర్తు చేశారు. దర్శి నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం, వారిని ఆదరించేందుకు తమ తలుపులు ఎప్పుడూ తీసి ఉంటాయని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాము సేవలు చేస్తున్నామని, ఇక ముందు కూడా చేస్తామని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు బూచేపల్లి కుటుంబం అండగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ డి.నారాయణరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటు పోలయ్య, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సైదా, జిల్లా అధికార ప్రతినిధి జి. లింగారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జి.దేవప్రసాద్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కేవీ రెడ్డి, శ్రీధర్, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు ఎం.సుబ్బారెడ్డి, ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు వి.కోటయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏసుదాసు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు పి.సాంబశివరావు, దొనకొండ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కురిచేడు మండల ఉపాధ్యక్షుడు వి. వెంకటేశ్వర్లు, పి.నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు ఏ.గోపాలకృష్ణ, ఎస్. నాగిరెడ్డి, పి.సుదర్శనం, ఎం.రామాంజనేయులు, కార్యదర్శులు బి. సుబ్బారావు, వి.బ్రహ్మయ్య, వై.రోశయ్య, ఎం.శ్రీను, యువజన విభాగం అధ్యక్షుడు కె.శివారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షుడు ఎం.నాగమణి, రైతు విభాగం అధ్యక్షుడు ఎం.యోగిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, ఎస్టీసెల్ అధ్యక్షుడు ఎం. నాగాంజనేయులు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ జానీ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎం.స్టాలిన్‌పాల్, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు టి.ఏడుకొండలు, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు జి.రాములు, వలంటీర్ విభాగం అధ్యక్షుడు షేక్ హుస్సేన్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ టీయూసీ విభాగం అధ్యక్షుడు ఎస్‌డీ సుభానీ, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షుడు జి.శ్రీలక్ష్మి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు పీవీ సుబ్బారావు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడు కె. సంతోష్‌కుమార్, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడు ఐ.సుబ్బారెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ఎం.ఏ సురత్నం, బూత్ కమిటీ అధ్యక్షుడు కిలారి శరత్, వైస్ ఎంపీపీ అన్నెం అరుణ, ఎంపీటీసీ బీవీ నరసయ్య, సర్పంచ్‌లు కె. కృష్ణయ్య, కె.భాస్కరరెడ్డి, ఎం.నాగేశ్వరరావు, నాయకులు ఎన్వీ నాగిరెడ్డి, ఆసుపల్లి చెన్నారెడ్డి, నుసుం ప్రతాపరెడ్డి, కె.గంగయ్య, ఇందూరి పద్మ, బెల్లం సాంబయ్య, వరికూటి వెంకటేశ్వర్లు, ఎస్.నాసరయ్య, పి.పెద్దయ్య, కె. నరసింహ, పి.వెంకటరెడ్డి, మస్తాన్‌వలి, టి.చెంచయ్య, జి.నాసరరెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇండియన్ ఆయిల్ బంకు తనిఖీ


ఆయిల్‌ను తనిఖీ చేస్తున్న ఆర్‌డీఓ కేశవర్ధన్‌రెడ్డి

దొనకొండ: స్థానిక శివ సాయి మణికంఠ ఇండియన్ ఆయిల్ బంకును కనిగిరి ఆర్‌డీఓ జి.కేశవర్ధనరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ప్రతి నెలా 30వ తేదీ తనిఖీలో భాగంగా తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పెట్రోలు, డీజిల్ నాణ్యతను పరిశీలించారు. కొలతల్లో తేడాలు గమనించారు. రికార్డులు పరిశీలించి ఎంతవరకు స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. వినియోగదారులకు నాణ్యతతో కూడిన ఆయిల్‌ను విక్రయించాలని నిర్వాహకులకు ఆర్‌డీఓ సూచించారు.

రేషన్ షాపు తనిఖీ

స్థానిక వీర వెంకటాపురం గ్రామంలోని షాపు నెం–4లో బయోమెట్రిక్‌ను, స్టాక్‌ను ఆర్‌డీఓ పరిశీలించారు. సంబంధిత డీలర్‌తో మాట్లాడారు.

సోలార్ భూముల పరిశీలన

మండలంలోని మల్లంపేట, మంగినపూడి, భూమనపల్లి, రాగమక్కపల్లి గ్రామాల్లోని వివిధ సర్వే నంబర్లలో ఉన్న భూములను ఆర్‌డీఓ కేశవర్ధనరెడ్డి పరిశీలించారు. మ్యాపు ద్వారా హద్దులు గమనించారు. కొండలు, గుట్టలు సోలార్‌కు అనుకూలం కాదని, భూమి హెచ్చు తగ్గులు లేకుండా చదరంగా ఉండాలని తహసీల్దార్ బి.రమాదేవికి సూచించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు: స్థానికంగా ఉన్న పలు పెట్రోల్ బంక్‌లకు తహసీల్దార్ బీవీ రమణారావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కల్తీకి పాల్పడకుండా నాణ్యమైన ధరలకే వాహనదారులకు పెట్రోల్ విక్రయించాలని, రక్షణ యంత్రాలు అందుబాటులో ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రజానగరంలో రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే నిత్యవసర సరుకులు లబ్ధిదారులకు అందించాలని రేషన్ డీలర్‌కు సూచించారు. వీరి వెంట వీఆర్వో పి.చంద్రశేఖర్‌రావు ఉన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ కేశవర్ధన్‌రెడ్డి

సాగర్ నీరు నేలపాలు


నాగంపల్లి ఎస్సీ కాలనీ పాఠశాల వద్ద వృథాగా పోతున్న నీరు

కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లి ఎస్సీ కాలనీ మండల ప్రాథమిక పాఠశాల(ఏఏ) వద్ద, బ్రాహ్మణపల్లి సమీపంలోని పొలాల్లో సాగర్ పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడటంతో తాగునీరు వృథాగా పోతోంది. దీంతో కుళాయిలకు సక్రమంగా నీరు రావడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించాలని, అలాగే పలుచోట్ల కుళాయిలు బిగించాలని ప్రజలు కోరుతున్నారు.

బదరీ నారాయణస్వామిగా చెన్నకేశవుడు


ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవ స్వామి

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి వారు తిరునక్షత్రం(పుట్టినరోజు) సందర్భంగా బదరీ నారాయణుడి రూపాంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అధ్వానంగా మట్టిరోడ్లు


పెద్దారవీడు-బద్వీడు వెళ్లే మట్టి రోడ్డుకు ఇరువైపులా చిల్లకంప

పెద్దారవీడు: మండలంలోని పెద్దారవీడు నుంచి చెంచుడూడెం మీదుగా బద్వీడు గ్రామం వరకు మట్టి రోడ్లపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మండల స్థాయి అధికారులు మారుతున్నా గ్రామాలకు వెళ్లే రోడ్డును బాగు చేసే నాథుడే కనపడటం లేదని చెంచుకాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి రోడ్లు వేయడంతో రాళ్లు లేచిపోవడంతో పాటు ధుమ్ముధూళి లేచిపోతోంది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లేటప్పుడు వెనుక వాహనంపై ప్రయాణించే వారికి కళ్లలో ధుమ్ముధూళి పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుపై వర్షం కురిసినప్పుడు రాళ్లు లేవడంతో అధికంగా గుంతలుగా పడుతుడటంతో ప్రయాణం చేయడం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాలకు వెళ్లాలంటే ఆటోల్లో ప్రయాణం నరకయాతనంగా మారిందని, గత్యంతరం లేక నిత్యం గ్రామాల మధ్య ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గర్భిణులు, వృద్ధులు ఆటోల్లో ప్రయాణించాలంటే భయపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల చిల్లకంప మూసుకొని ఉండటంతో రాకపోకలు సాగిస్తున్న సమయంలో ముఖానికి తగులుకొని గాయాలవుతున్నాయని వాపోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వారికి చెవిటి వాని చెవిలో శంఖం ఊదినట్లుగా ఉందని, పట్టించుకున్న పాపాన పోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి తారురోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.


చెంచుగూడెం సమీపంలో మట్టి రోడ్డుపై లేచిన కంకర రాళ్లు